క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడప రిమ్స్ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ మైనారిటీస్ నందు మూడవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. రెండు సంవత్సరాల కాల వ్యవధి గల ఫిట్టర్, సంవత్సరం కాల వ్యవధి గల కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ లతో పాటు డిజిల్ మెకానిక్, వెల్డర్ ట్రేడర్ల కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 10వ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థిని, విద్యార్థులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం నేరుగా ఐటీఐ కార్యాలయం వచ్చి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకుని వెరిఫికేషన్ చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 26వ తేదీ వరకు గడువు ఉందన్నారు. వివరాలకు 8523810530 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు.

వైవీయూలో శ్రమదానం


శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం విభాగం– 9 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ, వాణిజ్యశాస్త్ర విభాగాల్లో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పిచ్చిమొక్కలు, ఎండిపోయిన వృక్షాలను తొలగించారు. అలాగే మొక్కలకు పాదులు తీసి నీరుపోశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డా. బి. రెడ్డయ్య, అకడమిక్ కన్సల్టెంట్‌లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు


మృతదేహాన్ని అంత్యక్రియలు తీసుకెళ్తున్న శ్రీ కాశీవిశ్వనాథసేవాసమితి సభ్యులు

కడప అర్బన్ : కడప నగరంలోని మంగళివీధికి చెందిన పుల్లయ్య (70) కొన్ని సంవత్సరాల క్రితం తన భార్య, బిడ్డలకు దూరమై ఒంటరిగా చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కేన్సర్ బారినపడి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రిమ్స్ సిబ్బంది బాధితుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వాగా.. వారు అంత్యక్రియలు నిర్వహించేందుకు నిరాకరించారు. దీంతో శ్రీ కాశీ విశ్వనాథసేవా సమితి సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో బుధవారం వృద్ధుడికి సేవా సమితి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవామూర్తులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, పుట్టా పురుషోత్తం, దామోదర్, రాఘవేంద్ర, టైలర్ రవి, రాజశేఖర్‌రెడ్డి సివిల్ సప్లెస్ సురేష్, మధు పాల్గొన్నారు.

ఎస్పీ పరిశీలన

కడప అర్బన్ : నిర్మాణంలో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయ భవనాలను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు బుధవారం సాయంత్రం పరిశీలించారు. పనుల పురోగతిని ఏ.పి. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలనీ జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఏ.ఆర్. డీఎస్పీ మురళీధర్, ఏ.పి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ.ఈ. కె. రోశయ్య, డి.ఈ బి. మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

25న జిల్లాస్థాయి చదరంగం టోర్నమెంట్

కడప స్పోర్ట్స్ : కడప నగరం పాలంపాపయ్యవీధిలోని అనీస్ దర్బారీ చెస్ అకాడమీలో ఈనెల 25న 20వ అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ తెలిపారు. పూర్తి వివరాలకు 8341255151 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అన్నదానం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో శ్రీ సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన సోదరుడు మలిరెడ్డి శివానంద రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సోదరుని జ్ఞాపకార్థం ఆరేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఎం. క్రిష్టారెడ్డి, టి. రఘురాం, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామానికి చెందిన మేకల శాంతయ్య అక్రమ మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ బుధవారం తెలిపారు. వెల్లాల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశామన్నారు. శాంతయ్య వద్ద 24 క్వాటర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తెలుగుజాతి కీర్తి ‘ప్రకాశం’

- ఆదర్శనీయుడు ఆంధ్రకేసరి
- 23న టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

కడప కల్చరల్ : ఆంధ్రకేసరి.. ఆ పేరులోనే ఓ దర్పం .. తెలుగు జాతి పౌరుషం.. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతటి వారినైనా ఎదురించే గుణం.. తన గుండెను తుపాకీ గొట్టానికి అడ్డుపెట్టి తెల్ల దొరలను సైతం తెల్లబోయేలా చేసిన సాహసి ‘ఆంధ్రకేసరి’ టంగుటూరి ప్రకాశం పంతులు. ఈ నెల 23న ఆయన జయంతి. ఈ సందర్భంగా కడపతో ఆయనకున్న అనుబంధం చాలా గొప్పది.

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి అంతగా తెలిసి ఉండకపోవచ్చు. కానీ జిల్లాలోని స్వాతంత్య్ర సమరయోధులకు, ఆ నాడు ఆయన మార్గంలో నడిచిన వారు.. ఆంధ్రకేసరి పేరు వినగానే గర్వంతో ఉప్పొంగిపోతారు. స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రకాశం పంతులు వేసిన ప్రతి అడుగు ఓ పిడుగే.. మాట సింహగర్జన.. ఆయన పలుకరిస్తే నవనీతంలా ఉంటుందని, ఆగ్రహిస్తే అగ్ని వర్షం కరిసినట్టే ఉంటుందని అభివర్ణిస్తూ మురిసిపోతూ ఉంటారు స్వాతంత్య్ర సమరయోధులు.


కడప నగరంలోని ప్రకాశం పంతులు విగ్రహం

కడపతో అనుబంధం

■ 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ప్రకాశం పంతులు ఎత్తుగడలో భాగంగా కొన్నాళ్ల పాటు కడప జిల్లాలో ఉన్నారు. అప్పటి జిల్లా నాయకులు కడప కోటిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, బసిరెడ్డి తదితరులతో కలిసి ఇక్కడే రాజకీయ మంతనాలు జరిపారు. బ్రిటీష్ అధికారులు కడపలోనే ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రకాశం పంతులు శతజయంతి ఉత్సవాలను నిర్వహించిన సందర్భంగా కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో 1976 ఏప్రిల్ 20న ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, స్థానిక నాయకులు పి.బసిరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, నాటి కలెక్టర్ పీఎల్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

■ ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న జన్మించారు. 1957 మే 20న ఈ లోకాన్ని వీడారు. ఆయన నిరుపేద కుటుంబం నుంచి వచ్చినా.. ఉన్నత చదువులు అభ్యసించి న్యాయవాదిగా పని చేశారు. 1926లో స్వాతంత్య్ర ఉద్యమంలోకి ప్రవేశించారు. ‘స్వరాజ్య’ దినపత్రికను స్థాపించారు.

■ స్వాతంత్య్ర తర్వాత ముఖ్యమంత్రిగా ఉత్తమ పాలన అందించారు. 1972లో ఒంగోలు జిల్లాకు ఆయనపై గౌరవ సూచకంగా ప్రకాశం జిల్లాగా మార్చారు. రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాకు ఒక నాయకుడి పేరు పెట్టడం ఆయనతోనే మొదలైంది.

■ కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ కూడలికి ప్రకాశం సర్కిల్‌గా నామకరణం చేశారు. ఆయనపై గౌరవంతో కడప నగరం దొంగల చెరువులోని ఓ ప్రాంతానికి ప్రకాశం నగర్‌గా పేరు పెట్టారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కడప అగ్రికల్చర్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ తప్పని సరిగా చెట్లను నాటాలని ఊటకూరు కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన అమ్మ పేరుతో ఒక చెట్టు (ప్లాంట్ ఫర్ మదర్) అనే గ్లోబల్ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం కేవీకేలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. మొక్కల పెంపకాన్ని ఒక ఉద్యమంలో చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా కేవీకేలో 50కిపైగా మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్ర సమన్వయకర్త అంకయ్యకుమార్, ఊటకూరు ప్రధాన శాస్త్రవేత్తలు ప్రభాకర్‌రెడ్డి, త్రివిక్రమ్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.


కేవీకేలో మొక్కలు నాటుతున్న కేవీకే ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య, శాస్త్రవేత్తలు

పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటారు. ఈ నెల 20వ తేదీ కడపలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇన్‌టాక్ వారు నిర్వహించిన క్విజ్ కాంపిటేషన్‌లో ఇద్దరు విద్యార్థులు పార్టిసిపెన్సన్ సర్టిఫికెట్‌ను పొందారు. అలాగే అదే రోజు మధ్యాహ్నం ప్రభుత్వ గవర్నమెంట్ హైస్కూల్‌లో టీసీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో రోల్ ఆఫ్ యూత్ ఇన్ బిల్డింగ్ ఏ స్మార్ట్ ఇండియా హౌ క్యాన్ యంగ్ ఫీపుల్స్ కాంట్రిబ్యూట్ టు మేగింగ్ ఇండియా స్మార్టర్ పొగ్రాంలో జూనియర్ విభాగంలో ముగ్గురు విద్యార్థులు, సీనియర్ విభాగంలో ముగ్గురు గెలుపొందారు. విద్యార్థులను బుధవారం హెచ్ఎం ఎస్ఎస్ షర్మిలరాణి అభినందించారు.


అవార్డులు పొందిన విద్యార్థులతో హెచ్ఎం షర్మిలరాణి

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజియన్ వ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు.

ఈ మేరకు వారు బుధవారం జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు తాము అధికారులకు తెలియజేస్తున్నామని తెలిపారు. జమ్మలమడుగు, కడప డిపో మేనేజర్లు సమస్యలు సృష్టిస్తున్నారని, ఎన్నిమార్లు వినతిపత్రాలిచ్చినా.. సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం 28న నిరసన చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి సుధాకర్, కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, జమ్మలమడుగు గ్యారేజ్ కార్యదర్శి ఎస్ఎం వలి పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

కడప సెవెన్‌రోడ్స్ : కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారం చేసి దారుణంగా హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతా ఘటనను నిరసిస్తూ కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కడప కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశామని చెప్పారు. మహిళా వైద్యురాలిని దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కఠినంగా శిక్షించాల్సిన బెంగాల్ ప్రభుత్వం సరైన సమయంలో స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ సంఘటనను సుప్రీంకోర్టు సుమోటాగా స్వీకరించి 22వ తేదీ లోపు వివరాలు ఇవ్వాలని పదిమంది డాక్టర్స్‌ను నియమించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు హత్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

ఇన్‌చార్జి వీసీని తొలగించాలంటూ నిరసన

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని వీసీ పదవి నుంచి తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వలరాజు పేర్కొన్నారు. బుధవారం వైవీయూ ప్రధానద్వారంలోని వేమన విగ్రహం వద్ద వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని, వైవీయూ అధ్యాపక సంఘం ఖండించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వీసీని తొలగించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నాయకులు ఆకీరానందన్, రాజేష్, సంజీవ్, అశోక్ పాల్గొన్నారు.


వైవీయూ ముఖద్వారం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యా హక్కు చట్టం ప్రకారం ఆరేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు మేరీ అన్నారు. బుధవారం కడప భగత్‌సింగ్‌నగర్ కాలనీకి చెందిన అంగజాల హర్షిత మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యం కారణంగా బడి మానేసింది. దీంతో హెచ్ఎం మేరీ, సీఆర్‌పీ నాగమణికుమారి, విద్యార్థి హర్షిత తల్లిదండ్రులతో మాట్లాడి వయసు ఆధారంగా ఏడవ తరగతిలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మేరీ మాట్లాడుతూ బాలికలకు తప్పనిసరిగా కనీసం విద్యార్హతలన్నా పొందాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థి హర్షితకు కిట్టు అందించి అభినందించారు.


విద్యార్థికి అడ్మిషన్ ఫాంను హెచ్ఎం మేరీకి అందచేస్తున్న సీఆర్‌పీ నాగమణి కుమారి

25న సాహిత్య సదస్సు

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ప్రతి నెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా చిత్తూరుకు చెందిన విద్యావేత్త ‘ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ జీవితం–సాహిత్యం’ అనే అంశంపై కనిగిరికి చెందిన కవి, విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి ప్రసంగించనున్నట్లు తెలిపారు.

ల్యాబ్ టెక్నిషియన్లకు ట్రైనింగ్

కడప రూరల్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలులో ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి బుధవారం జిల్లాలోని ల్యాబ్ టెక్నిషియన్లకు మైక్రో స్కోపి సంబంధించి రీ ఓరియంటేషన్ ట్రైనింగ్‌కు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రీ టెస్ట్, పోస్ట్ టెస్ట్ నిర్వహించి ల్యాబ్ టెక్నిషియన్ల నైపుణ్యాన్ని పరిశీలించారు. మలేరియా, ప్యారాసైటును మైక్రో స్కోప్‌లో కనుగొనడాన్ని ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఎన్‌వీబీడీసీపీ నుంచి వచ్చిన సుభద్ర పర్యవేక్షణలో ట్రైనింగ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంఓ మనోరమ, ఏఎంఓ వెంకటరెడ్డి, మలేరియా సిబ్బంది, ల్యాబ్‌టెక్నిషియన్లు పాల్గొన్నారు.

ఇకపై ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లు

కడప కార్పొరేషన్: జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లను ఇకపై ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లుగా పిలవనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు తక్కువ ధరకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్న సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, పార్కులు, కాలువలు వంటి అన్ని సదుపాయాలతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పేరును ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లుగా మార్చారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

కడప అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి. రవికుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దొంగతనాలు జరుగకుండా కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శంకరాపురంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం కలిగితే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు ఇవ్వాలని కోరారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్ అధికారులకు ఇవ్వాలన్నారు. పోలీసులు వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని నిఘా ఏర్పాటు చేస్తారని తెలిపారు

క్రీడాకారుడికి వీసీ అభినందన

ఏఎఫ్‌యూ : కడప నగరంలో ఈనెల 20న నిర్వహించిన మారథాన్ రన్ కాంపిటీషన్‌లో డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం తృతీయ సంవత్సరం విద్యార్థి హరినాయక్ మూడోస్థానంలో నిలిచాడు.

జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో కడప నగరంలోని మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్‌కు వెళ్లే రైల్వే బ్రిడ్జి వరకు నిర్వహించిన మారథాన్ రెడ్ రన్‌లో మూడోస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ క్రీడాకారుడిని అభినందించారు. కార్యక్రమంలో పెయింటింగ్ విభాగం సమన్వయకర్త మనోహర్‌రావు పాల్గొన్నారు.

ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకల్లో కడప విద్యార్థి

వైవీయూ : నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ మూడవ సంవత్సరం ఎన్ఎస్ఎస్ విద్యార్థిని ఎల్. భువన 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంది. దేశరాజధాని ఢిల్లీలో ఎర్రకోట వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మెరిట్ సర్టిఫికెట్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాలకు విచ్చేసిన విద్యార్థినిని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. శచీదేవి అభినందించారు. కడప ఖ్యాతిని ఢిల్లీ వరకు తీసుకువెళ్లడం పట్ల ఆమెను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ఎంటీఎస్ అమలు చేయాలి

వైవీయూ : కాంట్రాక్టు అధ్యాపకులుగా సేవలందిస్తున్న వారికి మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్)ను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని యోగివేమన విశ్వవిద్యాలయంలోని అకడమిక్ కన్సల్టెంట్స్ బృందం, కడప శాసనసభ్యులు ఆర్. మాధవిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సెట్, నెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి, అతి తక్కువ వేతనాలతో విద్యాలయంలో పనిచేస్తున్న తమకు మినిమం టైంస్కేల్ (ఎంటీఎస్) అమలు చేసేలా చూడాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అకడమిక్ కన్సల్టెంట్‌లకు ఎంటీఎస్ అమలు చేసేందుకు సి.బి.ఎస్.వెంకటరమణ పేరుతో కమిటీ నియమించారని, అమలు దశలో ఎన్నికలు రావడంతో అర్ధాంతరంగా ఆ ప్రక్రియ ఆగిపోయిందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. జూనియర్ కళాశాలలో, డిగ్రీ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులకు 62,000 శాలరీ ఇస్తున్నారని, విద్యాలయాల్లో పనిచేసే తమకు 35,000 మాత్రమే ఇస్తున్నారని వివరించారు. విశ్వవిద్యాలయంలో పనిచేసే అధ్యాపకులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంటాక్ట్) హోదాతో పాటు రూ.57 వేల నుంచి 80 వేల వరకు సర్వీసును బట్టి వేతనం ఇవ్వాలని వారు కోరారు.

ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం కడప నగరంలోని ఆర్ఎం కార్యాలయంలో డయల్ యువర్ ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడపకు చెందిన కల్యాణ రామమూర్తి కడప నుంచి బెంగుళూరులోని స్కిల్ బోర్డు వరకు ఉదయం, రాత్రి 2 బస్సులను నడపాలని కోరారు. జమ్మలమడుగుకు చెందిన ఇనాక్ ప్రొద్దుటూరు–జమ్మలమడుగు మధ్య తిరుగుతున్న బస్సులు ప్రొద్దుటూరు కోర్టు వద్ద కాకుండా పాత బస్టాండుకు నడపాలని కోరారు. కడపకు చెందిన అనంతలక్ష్మి కడప డిపోలో పనిచేస్తూ 2012లో మృతి చెందిన తన భర్త బీఎస్ రెడ్డి స్థానంలో కారుణ్య నియామకం కింద తన పిల్లలకు ఉపాధి కల్పించాలన్నారు. కడపకు చెందిన పుష్పలత, రామలక్ష్మి కడప నుంచి ప్రొద్దుటూరు, జమ్మలమడుగులకు ఉదయం 5.30–6.00 గంటల మధ్య బస్సులు నడపాలని కోరారు. అలాగే అగడూరుకు చెందిన రాజు పులివెందుల నుంచి గంగనపల్లెకు ఉదయం పులివెందుల డిపో నుంచి బస్సు నడపాలన్నారు. కోడూరుకు చెందిన మల్లికార్జున కోడూరు బస్టాండులో మరుగుదొడ్లు శుభ్రం చేయడం లేదని, కూర్చొనేందుకు సీట్లు బాగా లేవని, కోడూరు–చిట్వేలి మధ్య షటిల్ సర్వీసులు తిప్పాలని కోరారు. ఎర్రగుంట్లకు చెందిన భాస్కర్ సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ఎర్రగుంట్ల నుంచి కడప వైపుకు బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత డిపో మేనేజర్లకు ఆర్ఎం సూచించారు.

ఏఎన్‌ఎంల పట్ల ద్వంద వైఖరి తగదు

కడప రూరల్ : సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ ద్వంద వైఖరి తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఏఎన్ఎంల సంఘం నాయకురాలు కమాల్‌బీ అన్నారు. ఆ మేరకు బుధవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం వైద్య ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల నియంత్రణలో కొనసాగాలని ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం తీసుకోవడం తగదని హితువుపలికారు. ఏఎన్ఎంలను వైద్య ఆరోగ్యశాఖలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయ ఏఎన్ఎంలుగా నివేదికలను ఇరు శాఖలకు నివేదించాలంటే అది సాధ్యమయ్యేపని కాదన్నారు. ప్రభుత్వం ద్వంద వైఖరిని విడనాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రవీణ, మంగమ్మ, నూర్జహాన్, సావిత్రి, కుమారి, అనిత తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ శశిభూషణ్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : బెల్లంమండిలోని ఇంటర్ నేషనల్ కల్యాణ మండపం వద్ద విద్యుత్ వైర్లు తెగిపడి సైకిల్‌పై వెళ్తున్న తన్వీరుల్లా అనే విద్యార్థికి కరెంట్ షాక్ తగిలి మృతి చెందారని, మరో విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ తెలిపారు. ఈ సంఘటన కారణమైన వారిపై వెంటనే కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చిన్నారుల మృతికి కారణమైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిత పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని బెల్లం మండిలో ఇంటర్ నేషనల్ కల్యాణ మండపం వద్ద విద్యుత్ వైర్లు తెగిపోయి కిందికి వేలాడుతుండగా సైకిల్‌పై వెళ్తున్న తన్వీరుల్లా అనే విద్యార్థి కరెంట్ షాక్ తగిలి మృతి చెందడం బాధాకరమని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు తెలిపారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం, మాటలకే పరిమితం అయిందని, అభివృద్ధి చేయడం లేదన్నారు. కరెంటు తీగలు రోడ్డుపై వేలాడుతుంటే పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. కలెక్టర్ చొరవ తీసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో ఎండు తెగులు నివారణ

కడప అగ్రికల్చర్ : సమగ్ర యాజమాన్య పద్ధతులతో తమలపాకు తోటల్లో ఎండు తెగులును నివారించవచ్చని బెంగళూరు ఐఐహెచ్ఆర్ చెందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ హిమబిందు అన్నారు. బుధవారం సీకేదిన్నె మండలం కొలుమలపల్లె గ్రామంలో తమలపాకులో ఎండు తెగులు.. సమగ్ర యాజమాన్యం అనే అంశంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ తోటల్లో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు నెలకు ఒక సారి చొప్పున 4 సార్లు ఒకశాతం బోర్డో మిశ్రమాన్ని పాదుల్లో పోసుకుంటూ 15 రోజుల ఒకసారి చొప్పున 8 సార్లు ఆకులపై పిచికారీ చేయాలన్నారు. ఉద్యానశాస్త్రవేత్త మానస మాట్లాడుతూ తమలపాకులో ప్రధాన సమస్య అయిన ఎండు తెగులు నివారణకు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి, 2 కిలోల ట్రైకోడెర్మావిరిడీని కలిపి పంటలకు వేయాలన్నారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈశ్వరరెడ్డి, ఉద్యాన అసిస్టెంట్ పావని, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ హిమబిందు

కడపలో ఆటోలకు పీసీ నంబర్ ఎక్కడ?


పీసీ నంబర్ లేని ఆటో

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలో తిరుగుతున్న ఆటోలకు ఆయా పోలీసు స్టేషన్లకు సంబంధించిన పీసీ నంబర్లు కనిపించడం లేదు. కడపలో ఆటో డ్రైవర్లకు నిబంధనలు వర్తించవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆటోకు ప్రమాదం జరిగితే నంబర్ ప్లేటుతో పాటు పోలీసులు ఇచ్చే పీసీ నంబర్ కీలకం . అయితే కడపలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా కొన్ని ఆటోలకు పీసీ నంబర్ లేకుండా రోడ్డు మీదకు వచ్చేస్తున్నాయి. దీనివల్ల ప్రమాదాలు, నగదును ప్రయాణికులు మరిచిపోయినప్పుడు ఆటో ఎవరిది, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలుసుకోవాలంటే కష్టం. జిల్లా కేంద్రంలో చాలా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఆటోలకు పీసీ నంబర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నగరంలో ఆటోలో బంగారు నగలున్న బ్యాగును ప్రయాణికులు పోగొట్టుకున్నారు. ఇప్పటికీ ఆటో ఆచూకీ తెలియలేదు. ఆటోకి పీసీ నంబర్ లేకపోవడంతో బాధితులకు న్యాయం జరుగలేదు. ఈ ఒక్క ఘటనే కాదు, ఇలా ఎన్నో ఘటనలు జిల్లావ్యాప్తంగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ప్రతి ఆటోను తనిఖీ చేసి పీసీ నంబర్ కేటాయిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బాధితుడికి నగదు అప్పగింత

కడప అర్బన్ : దంపతులు ఆటోలో నగదు మరిచిపోగా పోలీసులకు బాధితులకు అప్పగించారు. కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన అబ్దుల్ కలాం, ముంతాజ్ దంపతులు బుధవారం చెన్నూరు బస్టాండ్‌లో సమీపంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో నగలను తాకట్టి, రూ. 80 వేలను తీసుకుని తమ కుమార్తె చదువు కోసం పంపించాలనుకున్నారు. ఆటోలో ఎక్కి ఇంటికి వచ్చారు. అయితే రవీంద్రనగర్‌లో ఇంటికి రాగానే ఒకరినొకరు తమ దగ్గర డబ్బులు పెట్టుకున్నారని భావించి, ఆటోలోనే డబ్బులను వదిలేసి వచ్చారు. ఈ సంఘటనపై బాధితుడు వెంటనే కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీల ద్వారా ఆటో డ్రైవర్‌ను కనిపెట్టారు. వెంటనే సదరు డబ్బులను తీసుకుని వచ్చి సీఐ ద్వారా బాధితుడు అబ్దుల్ కలాంకు అప్పగించారు. బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సకాలం స్పందించి బాధితులకు నగదు అందజేసిన పోలీసులపై పలువురు ప్రశంసలు కురిపించారు.


బాధితుడు అబ్దుల్ కలాంకు డబ్బులను అప్పగిస్తున్న సీఐ జి. వెంకటేశ్వర్లు